క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. తుపాను హెచ్చరికల దృష్ట్యా ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విపత్తు నిర్వహణ దళాలు, ఐఎండీ బృందాలు, రెస్క్యూ సహాయక సిబ్బందితో పాటు స్థానిక రెవెన్యూ, మునిసిపల్, పోలీసు శాఖలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి.. పునరావాస కేంద్రాలు, షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలోనూ కమాండ్ కంట్రోల్ రూమ్‌లను సిద్ధం చేసి.. ఎంత వర్షపాతం నమోదవుతుందో గంటగంటకూ పర్యవేక్షించాలన్నారు. విజయవాడ వరద సహాయక చర్యలలో అశ్రద్ధ వహించినట్లు కాకుండా.. లోతట్టు ప్రాంతాలలో నీటిని తోడేందుకు కావలసిన మోటర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని.. అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో.. ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రజలందరూ స్వీయ రక్షణ పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.

సందేశాత్మకంగా 'ప్రేమకు పరాకాష్ట'



విజయవాడ కల్చరల్: గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం ప్రదర్శించిన సాంఘిక నాటకం ప్రేమకు పరాకాష్ట సందేశాత్మకంగా సాగింది. శ్రీధర్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ పాలకొల్లు, రవి అండ్ రవి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పరమ పవిత్రమైన భారతీయ వివాహ వ్యవస్థను నేటి తరానికి వివరించడమే లక్ష్యంగా నాటకం సాగింది. రచన, దర్శకత్వం మాడుగుల వెంకట కృష్ణ ప్రసాద్, పాత్రలలో జి. మనుప్రియ, శ్రీధర శ్రీనివాస్ నటించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా కళాకారులను అభినందించారు.

తాగునీరు వృథా



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పుట్‌బ్రిడ్జి సమీపంలో తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మధురానగర్ నుంచి ఏలూరు కాలువ పుట్ బ్రిడ్జి మీదుగా దేవీనగర్, జీవీఆర్‌నగర్ తదితర ప్రాంతాలకు పైపులైన్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పుట్‌బ్రిడ్జి వద్ద సుమారు మూడు నెలలుగా తాగునీరు వృథాగా పోతూనే ఉంది. ఇన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా కనీస చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్లపైనే వర్షం నీరు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే దేవీనగర్ రైల్వే బ్రిడ్జి వద్ద కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు నానాయాతన పడుతున్నారు. ఇక్కడ వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేదు. రోడ్డుపై నిలిచిన వర్షపునీరు ఎండకు ఎండే వరకు అలాగే ఉండిపోవటంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ వర్షపునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిల్లర నాణేల అందజేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పది రూపాయల నాణేలు చలామణిలో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవచ్చని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజియన్ డెప్యూటీ హెడ్ హరీష్ బేత అన్నారు. ఆ బ్యాంక్ విజయవాడ మెయిన్ బ్రాంచిలో ఖాతాదారులకు పది రూపాయల నాణేల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం హరీష్ బేత ప్రారంభించారు. ఈ అవకాశాన్ని బ్యాంక్ ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో తాలూకా కార్యాలయం

- ఏళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో సరి
- ఆవరణలో చెత్త చెదారం



గాంధీనగర్‌లోని తాలూకా కార్యాలయం



కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్త

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): గాంధీనగర్ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది తాలూకా కార్యాలయం. ఎప్పుడో కొన్ని దశాబ్దాల కిందట దీన్ని నిర్మించారు. కొన్నేళ్ల క్రితం వరకు నగరం మొత్తానికి తాలూకా కార్యాలయమే తహసీల్దార్ కార్యాలయం. పరిపాలన సౌలభ్యం కోసం నగరాన్ని నాలుగు మండలాలుగా విభజించి విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, నార్త్ తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తాలూకాలో విజయవాడ సెంట్రల్ తహసీల్దార్ కార్యాలయం నడుస్తోంది. దీనిలోనే డీఎస్ఓ కార్యాలయం, ట్రెజరీ, కోర్టు, జైలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి ఎదుట బెంగళూరు పెంకుతో వేసిన పందిరి పూర్తిగా దెబ్బతింది. దీంతో ఇటీవల పెంకులు తొలగించి రేకులు వేశారు. తాత్కాలికంగా మరమ్మతులు జరిగాయి.

శిథిలమైన భవనం..

ప్రస్తుతం వర్షాలకు గోడలు చెమ్మ వచ్చి కార్యాలయంలోని ఫైళ్లు నిమ్ముకుంటున్నాయి. చాంబర్‌లో శ్లాబు పెచ్చులూడుతోంది. భవనం శ్లాబుపై భాగం దెబ్బతింది. చెట్ల కొమ్మలు, ఆకులు రాలడంతో వర్షాకాలంలో నీరు నిలిచి అక్కడక్కడ శ్లాబు లీకవుతోంది. విజయవాడ నగరం నడిబొడ్డులో ఉన్న ఈ కార్యాలయానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడం లేదు. శిథిలమైన పాత భవనాన్ని తొలగించి ఇప్పటి అవసరాలకు తగ్గట్టుగా కొత్తది నిర్మించడం లేదు. అసలు ఈ కార్యాలయం గురించి ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. తాలూగా ఆవరణలో కార్యాలయాలు ఎక్కువగా ఉండడంతో ఎవరికి వారు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

కనీసం కూర్చోలేని దుస్థితి..

తహసీల్దార్ కార్యాలయం ఎదుట చక్కగా నీడ నిచ్చే చెట్లు ఉన్నాయి. కార్యాలయానికి వచ్చే వాళ్లు చెట్ల కింద ఏర్పాటు చేసిన బల్లలపై కూర్చొనే వారు. నిత్యం కళకళలాడుతూ ఉండేది. ఇప్పుడు అలాంటి వాతావరణమే కనిపించడం లేదు. ఆవరణ మధ్యలో గతంలో ఎప్పుడో చిన్న ఫౌంటేన్ ఏర్పాటు చేసి కృష్ణుడి ప్రతిమ ఏర్పాటు చేశారు. దాని గురించి పట్టించుకోకపోవడంతో కళా విహీనంగా కనిపిస్తోంది. దాని చుట్టూ చెత్తా చెదారం చేరింది. పిచ్చి మొక్కలు మొలిచాయి. కూర్చునేందుకు కూడా అవకాశం లేకుండా అధ్వానంగా తయారైంది. రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు కూడా వేయడం లేదు. కార్యాలయంలో ఒక లైట్.. మిగిలిన ఆవరణ అంతా చిమ్మచీకటి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది.

ఆవరణను బాగుచేయాలి..



తాలూకా లోపల అధ్వానంగా ఉంది. ప్రభుత్వ కార్యాలయం ఉండాల్సిన తీరుగా లేదు. గతంలో ఎంతో బాగుండేది. పరిసరాలు శుభ్రంగా ఉండేవి. ఇపుడు కూర్చోవడానికి కూడా అవకాశం లేదు. ఆవరణ మొత్తం చెత్తతో నిండి ఉంది. ఈ కార్యాలయానికి వెంటనే మరమ్మతులు చేయాలి. ఆవరణలో పూల మొక్కలు నాటడంతో పాటు, ఫౌంటేన్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి.

– జగన్, గాంధీనగర్

సీనియారిటీ జాబితా సరి చేయాలని డిమాండ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రవాణా శాఖ జోన్–3 నందు పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పరిపాలనాధికారుల సీనియారిటీ జాబితాను సరిచేయాలని భారతీయ బౌద్ధ మహాసభ సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళం సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ ఎస్సీ, ఎస్టీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ సీనియారిటీపై ఈనెల 10న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ఉత్తర్వులు సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, జేటీసీ రమశ్రీ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తూ, ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్షత చూపుతున్నారని, వారిని విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. క్యాచ్ అప్ రూల్స్ అమలు నిలిపివేయాలని కోరారు. ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు, ఆంధ్ర మాల్యాద్రి, వై. శ్యామ్ కుమార్, నల్లబోతుల మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సేవలు సక్రమంగా అందించండి



పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్ష జరుపుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మాతా శిశు సంరక్షణ సేవలు సక్రమంగా అందించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు తదితరులతో పలు అంశాలపై సమీక్ష జరిపారు. అందులో భాగంగా మాతా శిశు సంరక్షణ సేవలు మరింత మెరుగు పర్చాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ గుర్తింపు సంఖ్యలు మ్యాపింగ్, ల్యాబ్ పరీక్షలు నివేదికలు అమలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల నిర్వహణ, వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్షించారు. అంతే కాక క్షయ, లెప్రసీ వ్యాధుల నివారణ కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌టీఓ డాక్టర్ జె.ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, వైద్యులు పద్మావతి, మాధవినాయుడు, మోతీబాబు, స్నేహసమీర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ



వాక్ థాన్ నిర్వహిస్తున్న భవిత కేంద్రం నిర్వాహకులు, తల్లిదండ్రులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డిస్లెక్సియా (అభ్యసన వైకల్యాలు) గల పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు అన్నారు. మంగళవారం గాంధీనగర్ సీతన్నపేట గేటు వద్ద ఉన్న భవిత కేంద్రం ప్రత్యేక అవసరాల పిల్లలు గల తల్లిదండ్రులకు అభ్యసన వైకల్యాలపై అవగాహన కల్పించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2కే వాక్ థాన్ నిర్వహించారు. సీతన్నపేటలోని భవిత కేంద్రం నుంచి ప్రారంభమై బీఆర్టీఎస్ రోడ్డు వరకు సాగింది. ఈ వాక్‌థాన్‌ను విజయవాడ సెంట్రల్ మండల విద్యాశాఖాధికారి–1,2 డి. సాంబశివరావు, యు.విజయరామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యసన వైకల్యం గల పిల్లలు చదువడం, రాయడంలో సమస్యలను ఎదుర్కొంటారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అర్థం చేసుకుని సమస్యల నుంచి బయట పడేందుకు ప్రోత్సహించాలని సూచించారు. థామస్ ఆల్వా ఎడిసన్, స్టీఫెన్ హాకింగ్స్ వంటి వారు కూడా చిన్న వయసులో అభ్యసన వైకల్యాలతో బాధపడ్డవారేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్.పి.ఆర్.ఎం.సి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హర్షియా బేగం, భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు కె. వెంకట సుధ, జె. కుమార్ మధు పాల్గొన్నారు.

మానవ సంబంధాలతో ఒత్తిడిని జయించవచ్చు



హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు మాట్లాడుతున్న ఇండ్ల విశాల్

మానసిక వైద్యుడు ఇండ్ల విశాల్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమయపాలన, స్వీయగౌరవంతో పాటు మానవ సంబంధాలను పెంచుకోవడం వంటివి అలవాటు చేసుకోవడం ద్వారా నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని జయించవచ్చనని మానసిక వైద్యుడు విశాల్ ఇండ్ల చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం, సీఐఐ విజయవాడ శాఖ సంయుక్తంగా సిద్ధార్థ కళాశాల వెబ్‌నార్ హాలులో మానసిక ఒత్తిడి – నిర్వహణ అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. డాక్టర్ విశాల్ మాట్లాడుతూ.. నేటి తరం యువత పోటీ ప్రపంచంలో ఎక్కువగా ఒత్తిడికి గురవ్వుతున్నారన్నారు. ఆ ఒత్తిడి కారణంగా ఎక్కువగా యాక్సిడెంట్స్‌కు గురికావడం, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. విద్యార్థులు ఏదైనా అంశంపై అతిగా ఆలోచనలు చేస్తూ ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని అది సరైన విధానం కాదన్నారు. స్వీయ గౌరవం, కృతజ్ఞతాభావంతో యువత ఉండాలని సూచించారు. ఇతరుల నుంచి ఎక్కువగా ఏమీ ఆశించకుండా సానుకూల దృక్పథంతో ఉండటం వల్ల ఎటువంటి ఒత్తిడిని అయినా జయించవచ్చని చెప్పారు. ఇమీస్ ఫార్మాసూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.నాగలక్ష్మి, సీఐఐ ప్రతినిధులు చందన్ పట్నాయక్, డీవీ రవీంద్ర, కళాశాల డీన్ రాజేష్ సి. జంపాల, ప్రొఫెసర్ రహమాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను విశాల్ సమాధానమిచ్చారు.

దేశం గర్వించదగిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు



అబ్దుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగుల్‌మీరా తదితరులు



ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ



వసంతకుమార్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న దృశ్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఒక నిరుపేద కుటుంబంలో జన్మించి.. దేశ అత్యున్నత స్థానానికి చేరిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ దేశం గర్వించదగిన గొప్ప వ్యక్తి అని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు అన్నారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత ఏపీజే అబ్దుల్‌కలామ్ జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో మంగళవారం జరిగింది. ఆయన ముందుగా కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేడా రమేష్, కాళ్ల ఆదినారాయణ, మీసాల సత్యనారాయణ, వీబీ ఆచారి, రేపాల కిరణ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని పాలకులు పరిపాలన చేస్తే అభివృద్ధి సాధించవచ్చని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. మంగళవారం 62వ డివిజన్ అధ్యక్షుడు షేక్ ఖజా ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 93వ జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్‌అలీ, ఉపాధ్యక్షుడు ఎండీ కాలేషా, అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, నగర ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారత దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి భారతరత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ అని వాకర్స్‌క్లబ్ డెప్యూటీ గవర్నర్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బి. వసంతకుమార్ అన్నారు. స్థానిక బావాజీపేటలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు వీరంకి గోకర్ణేశ్వరరావు ఆధ్వర్యాన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్పందన సేవాసమితి అధ్యక్షుడు, వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ ఇమ్మానేని కృష్ణ ప్రసాద్‌లతో కలిసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వసంతకుమార్‌ను జ్ఞాపికతో సత్కరించారు. సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, అంబేడ్కర్ యువజన చైతన్య సంఘం అధ్యక్షుడు పోతుల విల్సన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలలు కనండి.. సాకారం చేసుకోండని అబ్దుల్ కలాం అన్న మాటల నుంచి యువత ప్రేరణ పొందాలని రామమోహన గ్రంథాలయ కమిటీ సూచించింది. మంగళవారం బందరు రోడ్డులోని రామమోహన గ్రంథాలయంలో అబ్దుల్ కలామ్ జయంతి కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యక్షుడు డి. రామచంద్రరావు, కార్యదర్శి వి. కేశవరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు

భారతరత్న అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. మంగళవారం ఠాగూర్ గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి వికాస వాహిని స్వచ్ఛంద సంస్థ హైస్కూల్ విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 127 మంది పాల్గొన్నారు. పోటీలలో నున్న జెడ్పీహెచ్ఎస్, చిట్టూరి హై స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలను జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అభినందించారు. వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రామన్ రావు, గ్రంథాలయ అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళులు..

పాయకాపురం(విజయవాడరూరల్): మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంకు 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మంగళవారం తన కార్యాలయంలో నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు యరగొర్ల శ్రీరాములు పాల్గొన్నారు.

వరద బాధితులను గాలికి వదిలేశారు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



బాధితులను కలిసి నష్టం వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీహెచ్ బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పాలక కూటమి నేతలు మద్యం షాపులను దక్కించుకోవడంలోనే మునిగి తేలుతున్నారని, వరద బాధితులను గాలికి వదిలేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. మంగళవారం అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజులు గడిచిన బుడమేరు వరద బాధితులకు పరిహారం అందలేదన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగి బాధితులు విసిగిపోయారన్నారు. ప్రజా ప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు. నెలలు గడుస్తున్నా ఇంకా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం సిగ్గుచేటన్నారు. మద్యం షాపులు, అక్రమ ఇసుక వ్యాపారాల్లో కూరుకుపోయిన ప్రజాప్రతినిధులు బాధితుల గోడు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి ఒక్క బాధితుడికి సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పిన మాట పాక్షికంగానే అమలు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి స్పందించి వరద ప్రాంతాల్లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. స్పందించకపోతే బాధితులు మరోసారి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. బాధితులకు తమ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. పర్యటనలో పార్టీ నాయకులు దుర్గారావు, నిజాముద్దీన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎంకే బేగ్ స్కూల్ వెనుక భాగంలో రోడ్డుపై అధ్వాన పరిస్థితి



రోడ్లపై పేరుకుపోయిన మురుగు



సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద వరదలో పాడైన సామాన్లు అలాగే వదిలేసిన దృశ్యం

వదలని ముంపు కంపు

- 59వ డివిజన్‌లో పడకేసిన పారిశుద్ధ్యం
- వరదొచ్చి నెల రోజులు దాటినా సింగ్‌నగర్ వీధుల్లో అదే పరిస్థితి
- చెత్త.. మురుగు.. దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. బుడమేరు వరద వచ్చి నెల రోజులు దాటినా కూడా ఇంకా ఇక్కడి వీధుల్లో ముంపు కంపు వదలడం లేదు. ఇక్కడ ఏ ప్రాంతం చూసినా చెత్తా, చెదారాలతో దర్శనమిస్తున్నాయి.

ఈ ప్రాంతాల్లో..

ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ పరిసర ప్రాంతాల్లో మురుగు తిష్టవేసింది. స్కూల్ ముందు భాగం, వెనుక గోడల వద్ద రోడ్డుపైనే నెలల తరబడి మురుగు నీరు పేరుకుపోయి ఉండడంతో దుర్వాసన వస్తోంది. స్కూల్ గోడకు ఆనుకొనే ఇంత దుర్భర దుస్థితి నెలకొనడంతో దోమలతో విద్యార్థులు స్కూల్‌లో సరిగా ఉండలేకపోతున్నారని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. శానిటరీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా చెత్తను తీసి వదిలేస్తున్నారే తప్ప పేరుకుపోయిన మురుగును తొలగించడం లేదని, వీటివల్ల డయేరియా కూడా వచ్చే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు. అలాగే సింగ్‌నగర్ రైతు బజార్ ముందు, వెనుక భాగాలు, నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్లపై కూడా కాలువల్లో మురుగు సక్రమంగా తీయడం లేదని, వీటివల్ల దుర్వాసనలు, దోమల సమస్యలు అధికంగా ఉన్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ డివిజన్‌లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించి.. తమకు విముక్తి కలిగించాలని కోరుతున్నారు.